క్లుప్తంగా

బతుకమ్మ, దసరా పండగలకు ఏర్పాట్లు పూర్తి


పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలో ఈనెల 22న నిర్వహించే బతుకమ్మ, 23 న జరిగే దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ తెలిపారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ సౌకర్యాన్ని బుధవారం పరిశీలించారు. దసరాకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలి పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్‌గౌడ్, ఎలిగేటి అనిల్, ఏఈ ప్రసాద్, మేనేజర్ వెంకట్,యూత్ అధ్యక్షుడు రాంమూర్తి పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించాలి


మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

కథలాపూర్: బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ బూత్ లెవెల్ కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికకు 40 రోజులే మిగిలి ఉందని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ఉండి పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేసిందని, ప్రతీ పక్షాలు చేసే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందగిరిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: మండలంలోని నందగిరిలో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్‌కు మద్దతుగా నాయకులు ప్రచారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీం కార్డులు పంపిణీ చేయడంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలు రూ. 500లకే సిలిండర్, పింఛన్ రూ. 4 వేలు, ఇందిరమ్మ ఇంటికి రూ. 5 లక్షలు, రూ. 2 లక్షలు రుణమాఫీ, రూ. 15 వేలు రైతుబంధు, నిరుద్యోగులకు పెన్షన్ తదితర పథకాలను ఓటర్లను వివరిస్తూ కాంగ్రెస్‌కు గెలిపించాలని కోరారు. నాయకులు అశోక్‌రెడ్డి, గంగాధర్, రవి, సత్యనారాయణరెడ్డి, రాజయ్య, సతీశ్‌గౌడ్, కనుకయ్య, అంజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం సైకిల్ యాత్ర


ధర్మపురి నుంచి ప్రారంభించిన సైకిల్ యాత్ర

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గం బీజేపీ అసెంబ్లీ టికెట్‌ను తనకు కేటాయించాలని కోరుతూ మద్దునూర్‌కు చెందిన బీజేపీ నాయకుడు రాయిల్ల రవికుమార్ సైకిల్ చేపట్టాడు. సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలని ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని వేడుకున్నాడు. ఎమ్మెల్యే టికెట్ కోసం రాష్ట్ర, జాతీయ నాయకులకు విజ్ఞప్తి చేయడానికి బుధవారం సైకిల్ యాత్ర ద్వారా హైదరాబాద్‌కు విజ్ఞప్తి యాత్రగా బయలు దేరాడు. రవికుమార్‌కు పలువురు నాయకులు మద్దతు తెలిపారు.

సెల్ ఫోన్ అప్పగింత

ధర్మపురి: మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన బొడకుంట రాజు అనే వ్యక్తి చెందిన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన యాప్‌తో సెల్‌ఫోన్‌ను వెతికి తిరిగి అప్పగించారు. సెల్‌ను అప్పగించిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

ఎల్ఆర్ఎస్ ఆదాయం మున్సిపాల్టీకే

- నిధి కోసం బ్యాంకులో ప్రత్యేక ఖాతా
- రాయికల్‌లో 1896 దరఖాస్తులు
- ప్రగతిలో 196


రాయికల్ మున్సిపాలిటీ

రాయికల్: ప్లాట్ల క్రమబద్ధీకరణ నిధుల విషయంలో ప్రభుత్వం మున్సిపాలిటీలకు తీపి కబురు అందించింది. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద జమ అయ్యే డబ్బులు వాటికి నేరుగా విడుదల కానున్నాయి. ఇందుకు బ్యాంకుల్లో ప్రత్యేక ఖాతా తెరవాలని ఆదేశాలు రావడంతో మున్సిపాలిటీల్లో కొత్త ఖాతాలు తెరుస్తున్నాయి. త్వరలో దరఖాస్తులకు సంబంధించిన డబ్బులు విడుదల కానుండగా రుసుము రూపేనా చెల్లించే డబ్బులు సైతం ఈ ఖాతాలో జమ కానున్నాయి. తద్వారా అభివృద్ధి పనులకు వీటిని వినియోగించుకునే అవకాశం ఉంది. అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఆగస్టు 2020లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. ఈ దరఖాస్తుల్లో భాగంగా రాయికల్ మున్సిపాలిటీలో 1896 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ప్లాట్ల క్రమబద్ధీకరణ రుసుమును సైతం మున్సిపాలిటీలకే వెచ్చించేలా ప్రత్యేక అకౌంట్లు తీశారు.

మూడేళ్ల కింద మార్కెట్ ధర ప్రకారమే..

రాయికల్ మున్సిపాలిటీలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో ఉన్న మార్కెట్ ధర ప్రకారమే ప్రభుత్వం రుసుము వసూలు చేయనుంది. ఒక్కో ప్లాట్‌కు రూ.15 నుంచి రూ.20 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. రుసుము రూపేనా మున్సిపాలిటీకి భారీగానే ఆదాయం సమకూరనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. 1896 దరఖాస్తులు రాగా, మున్సిపల్ అధికారులు 196 ప్రగతిలో ఉన్నట్లు తెలిపారు. ఏదేమైనా ఎల్ఆర్ఎస్ డబ్బులు మున్సిపాలిటీలకే వినియోగించడంతో రాయికల్ లాంటి చిన్న మున్సిపాలిటీలకు ఎంతో ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

డబ్బుల కోసం ప్రత్యేక అకౌంట్లు



ఎల్ఆర్ఎస్ డబ్బుల కోసం రాయికల్‌లో ప్రత్యేక అకౌంట్ తీశాం. ప ట్టణవ్యాప్తంగా 1896 దరఖా స్తులు రాగా, 196 దరఖాస్తులు ప్రగతిలో ఉన్నాయి. మిగతా దరఖాస్తులు పరిశీలిస్తున్నాం. మూడేళ్ల క్రితం మార్కెట్ ధర ప్రకారమే రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మున్నూరు కాపు నాయకులు

మల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు చేకూరుతుందని ఓయూ జేఏసీ నాయకుడు, సర్పంచ్ పాలేపు దిలీప్ అన్నారు. మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దేవర సురేశ్ రావుతో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌ని గెలుపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని ప్రజల సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పాటును అందించారని కొనియాడారు. సీఎం కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టోతో విపక్షాల ఓటమి ఖాయమైందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మేజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిన్న గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజయ్ గెలుపు కోసం కృషి చేస్తాం

మెట్‌పల్లిరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కే తమ మద్దతు ఉంటుందని కొండ్రికర్ల మున్నూరుకాపు సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సంఘ సభ్యులు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావును కలిశారు. ప్రజాశ్రేయస్సు కోసం నిరంతరం పాటు పడే సంజయ్‌ని గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, మున్నూరుకాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

మల్లాపూర్: కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికలో కోడ్ అములులోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ని కఠినంగా అమలు చేయాలని ఎన్నికల ప్రధానాధికారులు ఆదేశాలిచ్చిన కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి నిదర్శనమే మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జన్మదిన వేడుకలు. పీహెచ్‌సీలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి సంజయకుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారు. ప్రభుత్వ కార్యలయాల్లో రాజకీయ వేడుకలు నిర్వహించకూడదని అడ్డుచెప్పాల్సిన పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి రోగులకు పంపిణీ చేస్తూ కోడ్‌ని ఉల్లంఘించిందని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విపక్ష పార్టీలు డిమాండ్ చేశారు. దీనిపై డాక్టర్ వాహినిని వివరణ కోరగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్నామని, మీకు కూడా అందజేస్తామంటే అక్కడికి వెళ్లానన్నారు. అంతే కాని నిబంధనలు ఉల్లంఘించలేదని వివరణ ఇచ్చారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నఅధికారులు

జగిత్యాలరూరల్: మండలంలోని మోరపల్లిలో బుధవారం గ్రామస్తులకు విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ చెల్లింపులపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు నేరుగా తమ విద్యుత్ బిల్లులను సెల్‌ఫోన్ ద్వారా చెల్లింపులు చేసేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేఏవో మల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ బొల్లె సత్తమ్మ, సెక్రటరి రాజిరెడ్డి పాల్గొన్నారు.

కరెంట్ బిల్లులు మొబైల్‌ఫోన్‌లో చెల్లించాలి


రాయికల్: విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లులు మొబైల్‌ఫోన్ ద్వారా చెల్లించాలని మండల ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ కోరారు. బుధవారం రాయికల్ మండలం కుమ్మరిపల్లి, అయోధ్య గ్రామాల్లో విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లిస్తే ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉంటుందని, అంతేకాకుండా విద్యుత్ వినియోగదారులకు ఎంతో సులభతరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది రాములు, రమేశ్, లక్ష్మీరాజం పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు చేయడం సామాజిక బాధ్యత

మల్లాపూర్ : విద్యుత్‌ను పొదుపు చేయడం సామాజిక బాధ్యత అని టీఎస్ ట్రాన్స్‌కో ఏఈ రాకేశ్ కుమార్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పాతదాంరాజుపల్లి, కొత్తదాం రాజుపల్లి గ్రామాల్లో విద్యుత్ బిల్లుల డిజిటల్ చెల్లింపుపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మైదాసు శ్రీనివాస్, బద్దం సరిత, జేఏవో తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: విద్యుత్ వినియోగదారులు బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని కథలాపూర్ మండల ట్రాన్స్‌కో ఏఈ జమీల్‌పాషా కోరారు. మండలంలోని భూషణరావుపేటలో బుధవారం విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. సమావేశంలో సర్పంచ్ కూన సులోచన, కార్యదర్శి ఎం.డీ గఫూర్, ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, లైన్‌మెన్ గంగాధర్, వంశీ, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై వివాదం


బండరాళ్లను అడ్డుగా పెట్టిన రామలచ్చక్కపేట వాసులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మనగర్–రామలచ్చక్కపేట గ్రామాల మధ్య ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు విషయంలో వివాదం చోటుచేసుకుంది. బుధవారం గ్రామ శివారులోని వరదకాల్వ స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని చదును చేయగా రామలచ్చక్కపేట వాసులు ఆ స్థలంలో కందకం తవ్వడంతో పాటు దారికి అడ్డుగా బండరాళ్లు పెట్టారని ఆత్మనగర్ సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ విజయ్ ఆరోపిస్తున్నారు. అయితే తాము నర్సరీ, డంపింగ్‌యార్డ్, పల్లె ప్రకృతివనం, కంపోస్ట్ షెడ్, వైకుంఠధామానికి ఈ మార్గం గుండానే వెళ్తామని చెబుతున్నారు. గతంలో పలుమార్లు ఈ విషయంపై వివాదం తలెత్తగా సమస్య పరిష్కరించుకున్నప్పటికీ ఈ ప్రాంతం రామలచ్చక్కపేట రెవెన్యూ పరిధి అంటూ మరలా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. వరద కాల్వ స్థలంలో గతంలో కొంత భాగాన్ని చదును చేసుకుంటే అంగీకరించామని, కానీ ప్రస్తుతం అంతకన్నా ఎక్కువ స్థలాన్ని చదును చేసేందుకు ప్రయత్నిస్తే అడ్డు చెప్పామని రామలచ్చక్కపేట వాసులు చెబుతున్నారు. ఈ విషయంపై ఆత్మనగర్ సర్పంచ్ మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసు

మేడిపల్లి: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మేడిపల్లి ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. కొండాపూర్ గ్రామంలో కోడ్ ఉల్లంఘించి మద్యం అమ్ముతున్న వ్యక్తి నుంచి రూ.12 వేల విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కట్లకుంటలో రూ. 5700 విలువ గల 19 లీటర్ల గుడుంబా పట్టుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తుంగూర్‌లో బెల్టుషాపులపై దాడులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో బుధవారం పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామంలో ఓ వ్యక్తి గుడుంబా అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసి, 2 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గౌతంపవార్ తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మేడిపల్లి: భీమారం మండలంలోని పసునూర్, రాజలింగంపేట గ్రామాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు మేడిపల్లి, భీమారం మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొని రాహుల్ గాంధీ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వీఐపీలు, ప్రజాప్రతినిధుల ఓటర్ల వివరాలు నమోదు చేయాలి

ఇబ్రహీంపట్నం : వీఐపీలు, ప్రజాప్రతినిధుల ఓటర్ల వివరాలను గుర్తించి నమోదు చేయాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పీడబ్ల్యూడీ వికలాంగులు, 80 ఏళ్ల లోపు వారికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయుటకు ఫాం 12 డీ నింపి జారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను సన్మానిస్తున్న సర్పంచ్

వెల్గటూర్: వాలీబాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను బుధవారం ఎండపల్లి సర్పంచ్ మారం జలందర్‌రెడ్డి సన్మానించారు. ఈ నెల 16న రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ – 17 వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎండపల్లికి చెందిన క్రీడాకారులు సబ్బు గీతిక, పులి ప్రణీత్ రతన్‌లను, వారి తల్లిదండ్రులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సతీష్, వార్డు సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అవ్వల ఆశీర్వాదం కోసం..


ఎమ్మెల్యే సతీమణి రాధిక


భోగ శ్రావణి

జగిత్యాల: అవ్వా.. ఆశీర్వదించండి అంటూ ఎమ్మెల్యే సతీమణి రాధిక ఇంటింటి ప్రచారంలో భాగంగా కాలనీ వాసులను పలుకరించారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లామని, మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత ఉన్నారు.

రాయికల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరుపున తనకు అవకాశం వస్తే ఆశీర్వదించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి వృద్ధురాలిని కోరారు. మండలంలోని ఇటిక్యాలలో ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలిని కలిసి కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు


వేంపేటలో మహాచండియాగం


రాయికల్‌లో తెప్పోత్సవం

కోరుట్ల, కోరుట్ల రూరల్: పట్టణంతో పాటు మండలంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని మాదాపూర్‌లో నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర రావు ప్రారంభించారు. ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం వద్ద గల దుర్గా ఆలయంలో ఆర్డీవో రాజేశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు.

వేంపేటలో మహాచండియాగం

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వేంపేట గ్రామంలో శివదుర్గా యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మహాచండీయాగం నిర్వహించారు.

అమ్మవారికి గులాబీ చామంతిలతో అర్చన

జగిత్యాల: నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారు బుధవారం గులాబి చామంతికార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమాత వద్ద బుధవారం అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉదయం అన్నపూర్ణాదేవీగా, సాయంత్రం శాకాంబరీ రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని కూరగాయాలతో అలంకరించారు. అనంతరం భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకవచ్చి సమర్పించారు.

కూష్మాండ రూపంలో కనకదుర్గ అమ్మవారు

జగిత్యాలటౌన్: కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అష్టలక్ష్మీ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా శరన వరాత్సోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు బుధవారం అమ్మవారు కూష్మాండ అవతారంలో శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కన్నులపండువగా తెప్పోత్సవం

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లిలో నేతాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమాతను బుధవారం తెప్పోత్సవం నిర్వహించారు.

కోరుట్ల రూరల్: మండలంలోని మాధాపూర్ గ్రామంలో దుర్గా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో గ్రామ శివారులోని చెరువులో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.

శేష వాహనంపై వెంకన్న దర్శనం

కోరుట్ల: పట్టణంలోని అష్ట లక్ష్మీ, వేంకటేశ్వర ఆలయాల్లో దసరా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు వేంకటేశ్వరుడు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు


జగిత్యాలలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో బుధవారం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీ భట్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నరేశ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. పూలతో బతుకమ్మలను పేర్చి ఆడారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కొంక వేణు, రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాదు.. జాబితాలో పేరుండదు..

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ కింద రూ. 1 లక్ష వరకు మాఫీ చేయగా ఇప్పటికి చాల మంది రైతులకు రుణమాఫీ సొమ్ము జమకాక ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రైతుల పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని తుంగూర్ గ్రామానికి చెందిన కొండ మల్లేశ్ సంఘంలో 2018లో రూ.75 వేలు అప్పుగా తీసుకుని వడ్డీ చెల్లిస్తూ వస్తున్నాడు. రుణమాఫీపై ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. ఈ విషయంపై బ్యాంకుకు వెళ్లి అడగగా మీ పేరు రుణమాఫీ జాబితాలో లేదని, బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన చెన్న నర్సయ్యది కూడ ఇదే పరిస్థితి. దీనిపై బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో అయ్యోరి తిరుపతిని వివరణ కోరగా తాము రుణమాఫీకి పూర్తి వివరాలతో అందజేశామని, సంఘంలో ఎలాంటి తప్పు జరగలేదని, దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

కొప్పుల గెలుపొందాలని ఉగ్రనృసింహుడికి ముడుపు

ధర్మపురి: రానున్న శాసనసభ ఎన్నికల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ భారీ మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ బుధవారం ఉగ్రనృసింహస్వామి ఆలయంలో ముడుపు కట్టారు. దేవస్థానం రేనవేషన్ కమిటీ చైర్మన్ ఇందారపు రామన్న ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపించి ఆలయంలో ముడుపు కట్టారు. కార్యక్రమంలో రేనవేషన్ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం

మల్యాల: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపుకోసం నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎన్నికల్లో వ్యూహాలపై చర్చించారు. వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది

మెట్‌పల్లి: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి అన్నారు. బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రన్నింగ్,జంపింగ్, త్రోస్ విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని వీటిలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 25, 26 వ తేదీల్లో సూర్యాపేట జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు కొమురయ్య, అంజయ్య,రామదాస్, కార్తీక్, శంకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాధర్, ప్రశాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడాకారులను పోత్సహించడం అభినందనీయం

మల్లాపూర్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్మారక టోర్నీలను నిర్వహించడం అభినందనీయమని వైస్ ఎంపీపీ గొరు నాగేశ్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో బుధవారం ఆత్రం మహేశ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. యువత సన్మార్గంలో ముందుకు నడవాలన్నారు. క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల రమేశ్, మహేశ్ సేన సభ్యులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన బైండ్ల వీనిత్ కొన్ని నెలల క్రితం మెట్‌పల్లిలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మృతుడు బైండ్ల వినిత్‌కు మెట్‌పల్లి గాయత్రి బ్యాంక్‌లో ఖాతా ఉండటంతో ఇన్సూరెన్స్ చెక్కు రూ. 1 లక్షను బుధవారం తహసీల్దార్ ప్రసాద్, బ్యాంక్ అధికారులు మృతుడి తల్లి బైండ్ల లక్ష్మికి అందచేశారు. కార్యక్రమంలో గాయత్రి బ్యాంక్ మేనేజర్ శివకుమార్, అసిస్టెంట్ మేనెజర్ శశిధర్ చారి, తదితరులు పాల్గొన్నారు.